ప్రేమవేరు పెళ్లి వేరని వక్రభాష్యాలు చెప్పిన అతడికి ఆమె విధించిన శిక్ష?

# ప్రేమించి చూడు

అభిమన్యు
కథ

సంధ్యాసమయం.

సాగరతీరం. కెరటాలు పరుగు పరుగున నురగలు కక్కుకుంటూ వచ్చి, ఒడ్డును తాకి మరంతలోనే నెమ్మదిగా వెనక్కి మరలిపోతున్నాయి.

పశ్చిమ దిక్కు లేత నారింజ రంగులో చూడ్డానికి ముచ్చటగా వుంది. భానుడు పడమటి కనుమలలోకి ఏ క్షణంలోనైనా జారిపోవడానికి సిద్ధంగా వున్నాడు.

ఉందుండి పెద్దగా వచ్చిన కెరటాలు ఒడ్డున వున్న రాళ్లను తాకి చిందరవందరగా ఆ ప్రదేశమంతా పడుతున్నాయి. ఓ రాయి పై కూర్చున్న సంధ్య అప్పుడప్పుడు తనమీద సముద్రపు నీరు జల్లులా పడుతున్నా ఆమె పట్టించుకోవడంలేదు. ఆమె మనసు ఆమె దృష్టి ఎంతకీ రాని సాగర్ మీద వుంది.

సాగర్ తన స్నేహితుడు. తన హితుడు. తన ప్రేమికుడు. తన శ్వాస, తన ప్రాణం. అతణ్ని చూడని క్షణం తనకోయుగం.

సూర్యాస్తమయంలో జగమంతా చీకటి రేఖలు ఆక్రమిస్తున్నాయి. సముద్ర తీరానికి వచ్చేవాళ్లు ఎవరిళ్లకి వాళ్లు బయలుదేరుతున్నారు. రాని బస్సుకోసం ఎదురుచూసే ప్రయాణికునిలా ఎంతకీ రాని సాగర్ కోసం సంధ్య ఎదురుచూస్తూ కూర్చుంది. ఈ ఎదురుతెన్నులు తనకు బాగా అలవాటయ్యాయి. గత ఇరవై రోజుల్నుంచి ఇదే వరస. ఈరోజుకూడా రాడా?'' ఆ ఆలోచన రాగానే సంధ్య గుండె గుభేలుమంది. మరుక్షణం ఆమె కన్నులనుండి కన్నీటి చుక్కలు జలజలా రాలాయి.

సముద్రపు హోరు భయంకరంగా వుం

ఎలా వున్నా... సుందరి చెప్పిన నమ్మక తప్పడంలేదు. "సాగర్ నన్ను కాదని మరొక అమ్మాయిని పెళ్లిచేసుకోబోతున్నాడట..." నిజమా!

"ఇది నిజం. నా మాట నమ్ము..." అని చెప్పింది సుందరి. అయినా సంధ్య నమ్మలేదు. కాని... కాని ఏ మూలమూలలో ఓ చిన్న అనుమానం. ఆ అనుమానం క్రమంగా ఓ రూపాన్ని సంతరించుకుంటుంది. ఇప్పుడిప్పుడే...

సంధ్య బాగా ఆలోచించుకున్నాక, ఒక నిర్ణయానికి వచ్చింది. త్వరగా సాగర్‌ని కలవాలని.

◆

సంధ్య వెళ్లేసరికి సాగర్ పార్క్‌లో కూర్చుని ఏదో నవల చదువుతున్నాడు. సంధ్యను చూసి ఆశ్చర్యపోయాడు. కంగారుపడ్డాడు. మరుక్షణం తన తత్తరపాటు కనిపించనీయకుండా "సంధ్యా! నువ్వా...! రా... రా..." రాని నవ్వుతో ఆహ్వానించాడు.

సంధ్య సాగర్‌ని పరిశీలనగా చూసి అడిగింది "నేను గుర్తున్నానా...?"

"సంధ్యా! నువ్వు గుర్తులేకపోవడమేమిటి!? జోక్ చేస్తున్నావా!?" సాగర్ నవ్వాడు.

"మరి... ఇన్నాళ్లూ ఏమయ్యావ్? ఎక్కడికి వెళ్లావ్? చెప్పు?" సంధ్య సాగర్ రెండు భుజాలు పట్టుకుని ఊపేస్తూ అడిగింది "చెప్పు సాగర్... నిన్ను చూడందే క్షణమైనా ఈ సంధ్య జీవించలేదని తెలిసి ఎందుకు నన్నిలా బాధిస్తావ్..." సంధ్య సాగర్ గుండెలమీద తల ఆన్చి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

సాగర్ సంధ్య ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకుని "సంధ్యా! నువ్వింకా చనిపోలేదా!?" అని అడిగాడు.

మరుక్షణం సంధ్య సాగర్‌ని వీడి వెనక్కి తగ్గింది.

"సాగర్! నువ్వు... నువ్వు..." భయంగా చూస్తూ అంది.

"నేనే సంధ్యా! సాగర్‌ని. నన్ను చూడనిదే క్షణమైనా జీవించలేని నీవు ఇంకా బ్రతికే వున్నావా... అని ఆశ్చర్యంగా వుంది" నవ్వుతూ అన్నాడు.

"సాగర్! నీ అలా మాట్లాడకు. ఈ సమయంలో నువ్వు పరిహాసాలాడకు. నాకు పిచ్చెక్కిపోతుంది." సంధ్య చెంపలపై కారిన కన్నీటిని తుడుచుకుంది.

"సంధ్యా! నువ్వు పిచ్చిదానివైపోవాలి. ఆ పిచ్చిలో నువ్వు చనిపోవాలి..." సాగర్ సైకిక్‌గా నవ్వుతూ చాలా కాజువల్‌గా అన్నాడు.

"సాగర్! ఏం మాట్లాడుతున్నావ్ తెలిసే మాట్లాడుతున్నావా! ఇదేనా నీ ప్రేమ? ఇందుకేనా నన్ను ప్రేమించావ్! నేను చనిపోవాలా? అంటే... అంటే నీ గురించి విన్నదంతా నిజమేనా... నన్ను నన్ను కాదని ఎవరినో పెళ్లి చేసుకోబోతున్నావట...? మరి... మరి నన్నెందుకు ప్రేమించావ్? చెప్పు... చెప్పు?" సంధ్య హిస్టీరియా పేషెంట్‌లా అరుస్తూ అడిగింది.

"నిన్ను అనుభవించడంకోసం. నువ్వు చాలా అందంగా వుంటావ్. నీలాంటి అందగత్తెను ఇంతవరకూ చూడలేదు. అందుకే నువ్వు 'ఛీ' కొట్టినా భరించుకున్నా

నీ చుట్టూ, నీ ఇంటిచుట్టూ కుక్కలా... కుక్కలా తిరిగాను. చివరికి సాధించాను. నీలో ప్రతి అణువూ దోచుకున్నాను."

"స్టాపిట్ ఐసే... నీవింత నీచుడివని తెలీదు. మేకతోలు కప్పుకున్న పులివి. ఎంత చక్కగా నటించావ్! అందమైన నీ రూపం వెనుక, నవ్వు వెనుక ఇంతటి రాక్షసకృత్యం వుందని తెలుసుకోలేకపోయాను. గ్రహించలేకపోయాను. నీ మాయ మాటలు నమ్మి నీకు సర్వం అర్పించాను. ఇప్పుడు నా పరిస్థితి ఏమిటో తెలుసా?

"తెలుసు. నువ్వు మునుపటి సంధ్యవు కావు. నీకు మూడో నెల అనే విషయం తెలుసు. నీలో పెరుగుతున్న రూపం నాదేననికూడా తెలుసు. ఆత్మాభిమానంలేని నీలాంటి అమ్మాయిలు ప్రేమిస్తే చివరికి జరిగేది ఇలాగే." చెరగని చిరునవ్వుతో అన్నాడు సాగర్.

"సాగర్! ప్లీజ్. నన్ను అన్యాయం చేయొద్దు. నువ్వు కాదంటే నాకు చావే గతి. ప్లీజ్. సాగర్... ప్లీజ్... " సంధ్య సాగర్ కాళ్లు పట్టుకుని భోరున విలపించసాగింది.

తరతరాలుగా వస్తున్న ఈ జాఢ్యం స్త్రీ జాతిని వీడిపోదు.

సాగర్ సంధ్యను రెండు చేతులతో లేపి "చూడు సంధ్యా! నువ్వంటే ఇష్టం లేక కాదు! అమితమైన ప్రేమ వుంది. కాని, నా దృష్టిలో ప్రేమ వేరు. పెళ్లి వేరు. ప్రియురాలు వేరు. పెళ్లాం వేరు. అయినా ఏమాత్రం ఆత్మగౌరవం లేని నిన్ను నా భార్యగా స్వీకరించలేను. అందుకే బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను. అదే నిన్ను వుంచుకుంటాను. నా ఉంపుడుగత్తెగా వుండిపో... తన నిర్ణయం చెప్పాడు.

సంధ్య సాగర్‌ని వింతగా చూస్తోంది. 'జూ'లో జంతువుని చూసినట్లు చూస్తుంది. "ఈ వింత జంతువునా నేను ప్రేమించింది!" అని ఆశ్చర్యంగా చూస్తుంది.

## తల్లి

"సునీల్ నేను తల్లిని కాబోతున్నాను... మనిద్దరం తొందరగా పెళ్లి చేసుకోవాలి"

"అబ్బా... నీవుకూడా అదే చెప్పి విసిగిస్తావెందుకు" చిరాగ్గా అన్నాడు సునీల్.

— కె.వి.మధుసూదనరావు (కాకినాడ)



"లుక్ సంధ్యా! ప్రేమించడం వేరు. వాంఛించడంవేరు. వాంఛించిన వస్తువుని ఎప్పుడూ ప్రేమించలేదు. వాంఛించడం అంటే అనుభవించడం. అనుభవించడంవల్ల ఆ వస్తువు నశిస్తుంది... ఇవి నామాటలు కావు. బహుశా నీలాంటి వాళ్లను చూసే రాసి వుంటాడు బుచ్చిబాబు" సాగర్ చిన్నగా నవ్వాడు.

"అంతేకాదు మిస్టర్! నశింపు కాకుండా చేసేదే నిజమైన ప్రేమ" అనికూడా చెప్పాడు బుచ్చిబాబు. బహుశా నీలాంటి పశువులు వుంటారని ఆయనకు తెలీదులే" సంధ్య కోపంతో, కసితో కాండ్రించి సాగర్ ముఖంపై ఉమ్మి వెనుదిరిగింది.

◇ ◆ ◇

సంధ్య రెండు చేతులు గుండెలమీద ముడివేసుకుని సముద్రపు ఒడ్డున నిల్చుంది. సముద్రుడు నల్లగా, నిర్మలంగా వున్నాడు. అప్పుడప్పుడూ కెరటాలు వచ్చి ఆమె కాళ్లను తాకి వెనక్కి వెళ్లిపోతున్నాయి. అవి వెళ్తూ వెళ్తూ ఆమె కాళ్లకింద ఇసుకను కొంత కొంత వేసుకుపోతున్నాయి.

"ఏమిటి తన జీవితం? ఎందుకిలా మోసపోయాను! ప్రేమించడం నేరమా? నేరమనే రుజువుచేశాడు. సాగర్... నాకోసం ప్రాణమైనా ఇస్తానన్న వ్యక్తి ఈరోజు నా ప్రాణాలు కోరుతున్నాడు. నాకోసం జీవిస్తున్నానన్నాడు. నాకోసం ఏమైనా చేస్తానన్నాడు. హు.. ఎంత అందమైన అబద్ధం... అతని మాటలకు చేతలకు మైమరచి, మత్తెక్కి నన్ను నేను మరిచాను. అతనో బోయవాడని గ్రహించలేకపోయాను. క్షణంలో కరిగిపోయే ఇంద్రధనుస్సును మోహించాను. నా సొంతమనుకున్నాను. కాని... కాని..."

అమ్మలేని నన్ను నాన్న అల్లారుముద్దుగా పెంచాడు.నాకోసం నాన్న తన సుఖాలు, సౌఖ్యాలు వదులుకుని కంటికి రెప్పలా చూసుకున్నాడు. అలాంటి నాన్న కళ్లు కప్పి ప్రేమలో పడ్డాను. జీవితం నాశనం చేసుకున్నాను. ఈ విషయం నాన్నకి తెలిస్తే ఆయన బ్రతకగలరా...! అందుకే... అందుకే చనిపోవాలి. నాలాంటిదానికి తగిన శిక్ష చావు.

సంధ్య సాగర గర్భంలో కలిసిపోవాలని నిర్ణయించుకుంది. ఆమె పాదాలు సాగరుని వైపు కదిలాయి.

చిన్నప్పుడు నాన్నతో వచ్చి ఈ అలలతో ఆడుకునేదాన్ని. మార్నింగ్ వాక్‌కి వచ్చినప్పుడు ఈ అలలను తన్నుకుంటూ నడిచేదాన్ని. అంతేకాదు. ఆ అలలతో తడుస్తూ సాగర్‌తో కలిసి చెట్టాపట్టాలేసుకుని తిరిగేదాన్ని. ఆ అలల సాక్షిగా సాగర్ కౌగిలిలో మురిసాను. నేడు ఈ అలల సాక్షిగా కుమిలుతున్నాను. ఈ అలలలో కలపిపోతున్నాను... ప్చ్...

సాగరుడు తన హస్తాలను విశాలంగా చాపి సంధ్యను ఆహ్వానిస్తున్నట్లుగా వుంది. అవును మరి... ఇలాంటి వారిని ఎంతమందినో చూసి వుంటాడు. ఇలా ప్రేమ పేరుతో మోసపోయిన అమ్మాయిలనెందరినో తనలో ఐక్యం చేసుకుని వుంటాడు.

ఒక్క క్షణం చాలు జీవితంమీద విరక్తి కలిగి అర్ధాంతరంగా జీవితాన్ని ముగించుకోవాలనే ఆలోచన రావడానికి. ఆ సమయంలో ఆ వ్యక్తిని ఎవ్వరూ ఆపలేరు. నిజానికి

ఎవరైనా ఆ ప్రయత్నం నుంచి ఆ వ్యక్తిని ఆపగలిగితే ఇహ జీవితంలో ఎన్నడూ ఆత్మహత్యా ప్రయత్నానికి పూనుకోదు.

నీరు సంధ్య కాళ్లను దాటి, నడుంను దాటి, గుండెలవరకు వచ్చింది. మరో నిమిషంలో ఆమె సముద్రునితో కలిసిపోతుంది. అప్పుడు... అప్పుడు బలమైన రెండు చేతులు ఆమె భుజాలు పట్టుకుని ఆపగలిగాయి. సంధ్య ఈ హఠాత్సంఘటనకు తల తిప్పి చూసింది.

◇ ◆ ◇


"నాన్నా! నేను... నేను..."

"చెడిపోయాను... మోసపోయాను" అంటావు. నీ ముఖం నాకు చూపించలేక చనిపోదలిచావ్. దానివలన ఒరిగేదేమిటి? నువ్వు చెడిపోయింది, మోసపోయింది ఎవరి వలన? ప్రేమించడం నేరమని నేను అనను. సృష్టిలో ప్రేమకి అందమైన స్థానం వుంది. మీరిద్దరూ ఒకర్నొకరు ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుందామనుకున్నారు. వయసు పెట్టే తొందరలో, వేడిలో శారీరకంగా కలిశారు. ఫలితంగా నీవు గర్భవతివైనావు. ఇప్పుడు అతను కాదన్నాడని ఎంతో భవిష్యత్తు వున్న నీ జీవితాన్ని అర్థాంతరంగా ముగించుకుందామనుకున్నావు. ఈ నాన్నను వదిలి వెళ్లిపోదామనుకున్నావు. కదూ! సంధ్యా! ఎవరైనా నిన్ను కొడితే ఊరుకుంటావా? నీ వస్తువు ఎవరైనా తీసుకుంటే ఊరుకుంటావా! వాళ్ల చెంప పగలగొట్టవూ!?"

"నాన్నా!"

"తల్లిదండ్రులు పిల్లలకు ఆత్మాభిమానం, ఆత్మగౌరవం నేర్పాలి. వాళ్లలో ఆత్మవిశ్వాసం, ఆత్మస్థయిర్యం కలిగించాలి. ఈనాడు అవి లేకే అమ్మాయిలు స్వేచ్ఛ పేరుతో బాయ్‌ఫ్రెండ్స్‌తో తిరిగి గర్భాలు తెచ్చుకుని దిక్కులేని చావులు కొందరు చస్తుంటే మరికొందరు అనాథ స్థితిలో పిల్లల్ని కని సిగ్గుమాలిన జీవితాలు గడుపుతున్నారు. వీరి

## 3వేల సినిమాలు!



హాలీవుడ్‌లోని ప్రముఖ ఫిలిం సంస్థ (పేరామౌంట్) ఇప్పటికి మూడువేల చిత్రాలను నిర్మించింది! ఎడాల్ఫ్ జుకోర్ అనే హంగరీ దేశస్థుడు ఆ సంస్థను నెలకొల్పాడు. 81 సంవత్సరాల వయస్సుగల ఈ కంపెనీ 'ఎలిఫెంట్‌మాన్', 'ప్రిన్స్ ఆఫ్ ఎలెగ్జురోగాడ్' 'ఏ ట్విన్ అండ్ అన్‌టచబుల్స్', 'ది టెన్ కమాండ్‌మెంట్స్' వంటి చిత్రాలను నిర్మించింది. మూడువేల చిత్రాలను నిర్మించిన 'పేరామౌంట్' సంస్థ ఎంత ఘనమైందో గదా!

— కొడిమెల శ్రీరామమూర్తి

జీవితాలు ఇలా తయారవ్వడానికి కారకులైన మగరాయుళ్ళు మాత్రం హేపీగా వున్నారు. సంఘంలో మంచి జీవితం గడుపుతున్నారు. ఎందుకిలా జరుగుతుంది? మీలో పిరికితనం ... మీలో ఆత్మన్యూనతాభావం మిమ్మల్ని బలిగొంటుంది''

విశ్వనాథం ఆవేశంతో చెప్తుంటే సంధ్య ఆశ్చర్యంతో చూస్తుంది.

''సంధ్యా! నువ్వెందుకు చనిపోవాలి? నీలో ఈ పిరికితనం ఎలా వచ్చింది? నువ్వు ఎమ్మే చదువుతున్నావు. నువ్వు తీసుకున్న సబ్జెక్ట్ పొలిటిక్స్. నీ చదువు నీకిదే నేర్పిందా! ఇదేనా నీ సంస్కారం!? ఆలోచించు! అందరిలాగే నీవుకూడా ప్రేమ పేరుతో మోసగించబడి ఆత్మహత్య చేసుకుంటావో! లేక నీ తర్వాత వారికి ఆదర్శంగా నిలుస్తావో! నీ ఇష్టం'' విశ్వనాథం సంధ్య చెంపను చిన్నగా తట్టాడు.

''ఇలా చేసినందుకు మగాళ్ళైతే నరికి పోగులు పెట్టేద్దురు! కాని, తన తండ్రిలాంటివారు ఎంతమంది వుంటారు. సంధ్య ఆలోచిస్తూ ఒక నిర్ణయానికి వచ్చింది''

తెలతెలవారకముందే మంచు తెరలు వీడక ముందే సూర్యుడు తూర్పుదిక్కున పొడవక ముందే యూనివర్శిటీ విద్యార్థిని విద్యార్థులు సాగర్ ఇంటిముందు నినాదాలు ప్రారంభించారు.

''సాగర్ డౌన్‌డౌన్...''

''మోసగాడు సాగర్ డౌన్‌డౌన్...''

''సంధ్యను ప్రేమించి దగాచేసిన సాగర్ డౌన్‌డౌన్...''

ఈ అరుపులకి, కేకలకి సాగర్, అతని తండ్రి సత్యమూర్తి, తల్లి పార్వతి బాల్కనిలోకి వచ్చి చూశారు. ఖంగుతిన్నారు. ముఖ్యంగా సాగర్ బాగా కలవరపడ్డాడు.

సత్యమూర్తికి రెండు రైస్‌మిల్లులు, రెండు ఆయిల్ మిల్లులు, రెండు పెట్రోల్ బంకులు వున్నాయి. అలాగే ఇద్దరు పెళ్లాలు. ఆయనకు మెండుగా డబ్బేకాదు, పొగరుంది, గర్వం వుంది. రాజకీయాల్లో బాగా పలుకుబడి వుంది.

క్రమంగా ఈ విషయం నగరమంతా ప్రాకిపోయింది. యూనివర్శిటీ విద్యార్థులు బలవంతంగా స్కూళ్ళ కాలేజీలు మూయించేసి విద్యార్థులను వెంటబెట్టుకు వచ్చారు. సాగర్ ఇంటిముందు యాత్రలా తయారైంది. అతని ఇల్లు నాలుగు రోడ్ల కూడలిలో వుండడంవల్ల ఈ జనప్రవాహానికి ట్రాఫిక్ ఆగిపోయింది.

రయ్... రయ్‌మని పోలీస్ జీపులు దూసుకువచ్చాయి. అందులోంచి ఎస్.ఐ, సి.ఐ దిగారు. ఈ జనాన్ని చూసి కాస్త కంగారుపడ్డారు. మీలో మీకు ఏమైనా గొడవలుంటే మీలో మీరే సరిచేసుకోవాలి. అంతేగాని ఇలా రోడ్‌కెక్కి జనజీవనానికి భంగం కలిగించొద్దు. పెద్ద మనుషులను ఇలా అగౌరవపరచడం మంచిదికాదు'' అని సి.ఐ వాళ్లకి సర్దిచెప్పబోయాడు.

''ఎవరండీ పెద్ద మనుషులు? ఇవా పెద్దమనుషులు చేసే పనులు? ఈ అమ్మాయిని ప్రేమించి, పెళ్లిచేసుకుంటానని మాయమాటలు చెప్పి, నమ్మించి గర్భవతిని చేశాడు. ఇప్పుడు పెళ్లిచేసుకోమంటే కాదంటున్నాడు. ఈ అమ్మాయి బ్రతుకు ఏం

కావాలి? ఇదే మీ అమ్మాయి అయితే ఏం చేస్తారు? మీరేమైనా చెప్పదలచుకుంటే వెళ్ళి వాళ్ళకి చెప్పండి'' అని మహిళామండలి సెక్రటరీ రాజ్యలక్ష్మి ఎదురు ప్రశ్నించింది.

''మీరిలా మొండిగా వాదిస్తే లాఠీఛార్జి చేయాల్సొస్తుంది'' అని సి.ఐ హెచ్చరించారు.

''లాఠీ ఛార్జి కాదుగదా కాల్పులు జరిపినా మేము కదలం. దోషుల్ని వదిలి మమ్మల్ని శిక్షిస్తే ఈ స్త్రీశక్తి తడాకా ఏమిటో చూపిస్తాం ...'' అని రాజ్యలక్ష్మి తన సహజధోరణిలో అనగానే ''సి.ఐ డౌన్ డౌన్... సి.ఐ డౌన్ డౌన్'' అని నినాదాలు వినిపించాయి.

నగరంలో ప్రజా జీవనం స్తంభించిపోయింది. ఎక్కడి వాహనాలు అక్కడ ఆగిపోయాయి. ఆఫీసులకి వెళ్ళేవాళ్ళు మార్గ మధ్యంలో ఆగిపోయాయి. జనం గుంపులు గుంపులుగా ఆ ప్రదేశానికి తరలివస్తున్నారు.

అగ్నికి ఆజ్యం పోసినట్లు ప్రతిపక్ష రాజకీయ నాయకులు, వినాయకులు వారి వారి బలగాలతో వచ్చారు. అక్కడి వాతావరణం మరింత వేడెక్కింది.

పైనుంచి సూర్యుడు నిప్పులు కురిపిస్తుంటే... నేలమీద పోలీసులు భాష్పవాయువు ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు. అప్పటికప్పుడు గుంపులు గుంపులుగా వున్న జనం చెదిరినా మరలా పరిస్థితి మామూలు స్థితికి వచ్చింది.

ఈలోగా జిల్లా కలెక్టర్, ఎస్.పి వచ్చారు. వారి రాకతో నినాదాలు ఆగాయి. అలజడి కాస్త సద్దుమణిగింది.

కలెక్టర్ సాంబశివరావుగారు అందరినీ పరిశీలనగా చూసి ''మీకేం కావాలి?'' అని అడిగారు.

''న్యాయం. నిజానిజాలు విచారించి ఇక్కడే ఈ ప్రజా సమక్షంలోనే న్యాయం చెప్పాలి'' రాజ్యలక్ష్మి అడిగింది. ఆమెతోపా



టు అందరి గొంతులు ఏకం అయ్యాయి.

సాంబశివరావుగారు కాసేపు ఆలోచించి "అలాగే... మీరు కోరినట్లుగానే చేస్తాను" అన్నారు.

◆

సాగర్, సంధ్యల వాదనలు విన్నాక, సాక్షులు చెప్పిన దాన్నిబట్టీ వీరిద్దరూ వ్రాసుకున్న ప్రేమలేఖలు చదివాక, వీరు తీయించుకున్న ఫోటోలు చూసినమీదట సాగర్ సంధ్యలు ప్రేమించుకున్నారని, పెళ్లి చేసుకుందామనుకున్నారని కలెక్టర్ సాంబశివరావుగారు గ్రహించారు.

"మిస్టర్ సాగర్! నువ్వు ప్రేమించిన ఈ సంధ్యను పెళ్లిచేసుకోవడానికేగల అభ్యంతరమేమిటి?" అడిగారు కలెక్టర్‌గారు.

"సార్! సంధ్యను మనసారా ప్రేమించాను. పెళ్లి అంటూ చేసుకుంటే ఆమెనే చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. కాని... కాని ఆమె నన్ను మోసం చేసింది. ఆమె గర్భవతి కావడానికి కారణం నేనుకాను" ఒంటికాలుమీద కొంగజపం చేసినట్లు సాగర్ చేతులు కట్టుకుని చెప్పాడు.

"మరి ఎవరు?" కలెక్టర్‌గారు తీక్షణంగా అతన్నే చూస్తూ అడిగారు.

"ఏమో! ఆమెనే అడగండి..." కాస్త కేర్‌లెస్‌గా సంధ్యవైపు చూపిస్తూ అన్నాడు సాగర్.

ఆ మాటలకి అందరూ సంధ్యవైపు, సాగర్‌వైపు ఆశ్చర్యంగా చూడసాగారు.

"ఎందుకుసార్! అలా ఆశ్చర్యంగా చూస్తారు! నా మాటలమీద నమ్మకం లేకపోతే ఆమెకు డి.ఎన్.ఏ పరీక్షలు చేయించండి. ఆమె గర్భంలో శిశు ఎవరిబిడ్డో తేలిపోతుంది" అని సాగర్ ఆవేశంతో అన్నాడు.

సాంబశివరావుగారు సాగర్‌వైపు అనుమానంగా చూసి, తల పంకించి మిస్ సంధ్యా! ఈ విషయంలో మీ అభిప్రాయం?" అడిగారు.

సంధ్య చిన్నగా నవ్వి ఇలా అంది.

"హత్యచేసిన వ్యక్తి ఈ హత్యను నేను చేయలేదు. కావాలంటే రుజువుచేయండి" అంటే ఏం చేస్తారుసార్?"

"నా గర్భస్థ శిశువుకి తండ్రి అతనా కాదా అని తెల్సుగల పరీక్షను చేసుకుని అతనే తండ్రి అని తెలిస్తే అతనితో నాకు పెళ్లిచేయడమో! లేక అతన్ని శిక్షించడమో చేస్తారు"

"సార్! కొన్ని పరీక్షలు వైద్య అవసరాల కోసమే ఉపయోగించాలి. స్త్రీల ప్రవర్తనల్ని రుజువు చేసే లక్ష్యంతో ఏ పరీక్షని నిర్వహించకూడదు. 'సైన్సు' అనే దాన్ని మానవ సంబంధాల్లో ఎక్కడ ఉపయోగించాలో... ఎక్కడ ఉపయోగించకూడదో తెలియని స్థితిలో వున్నా" అని క్షణమాగి "ఈ పరీక్ష మగవాడికే పరీక్ష అనుకుంటున్నారేమో! పరీక్షకి నిలబడడమంటే స్త్రీ తనని తాను నిరూపించుకోవడమే! ఆత్మాభిమానం, ఆత్మగౌరవంగల ఏ స్త్రీ ఇలాంటి పరీక్షలకు అంగీకరించదు. నేటి ఈ డి.ఎన్.ఏ పరీక్షకి ఆనాటి సీత అగ్నిపరీక్షకి తేడా ఏమిటి? చెప్పండి సార్?" సంధ్య సూటిగా ప్రశ్నించింది.

కలెక్టర్ సాంబశివరావుగారు కాసేపు ఆలోచించి "సాగర్ కావాలనే సంధ్యను

మోసం చేశాడని. ఆమెను ప్రేమించి ఆమెను గర్భవతిని చేశాడని... కావున సాగర్ సంధ్యను పెళ్లి...'' తన తీర్పు చెప్పబోతుంటే సంధ్య మధ్యలో అడ్డుకుంది!

''ఆగండి మిస్టర్ కలెక్టర్! మీరు ఇవ్వబోయే తీర్పు ఏమిటో తెలుసు. ఈ సాగర్ నన్ను పెళ్లిచేసుకోవాలని చెబుతారు. అంతేగా! కాని... ఈ పెళ్లికి నేను అంగీకరించొద్దా! నా కడుపులో బిడ్డకి తండ్రిని నేను కాను. అంతగా అయితే ఉంపుడుగత్తెగా వుంచుకుంటానన్న వ్యక్తిని ఆత్మాభిమానంగల ఏ ఆడదైనా కట్టుకోడానికి ఇష్టపడుతుందా? మీరు బలవంతంగా పెళ్లిచేస్తే ఆ వ్యక్తి నన్ను భార్యగా చూస్తాడా? పనిమనిషిగా చూస్తాడా? చెప్పండి''

''సార్! అతనితో నాకు పెళ్లి జరిపించమని కాదు నా ఈ పోరాటం. ఇలాంటివాళ్లు చాలామంది వున్నారు. స్త్రీ పురుషుల సంబంధంవలన గర్భం పురుషుడికి రాదనీ, స్త్రీకే వస్తుందనీ అందరికీ తెలుసు. అయినా ఇలాంటివారి మాయ మాటలు నమ్మి ఎందరో ఎందరో అమ్మాయిలు వంచితులవుతున్నారు'' సంధ్య ఆవేశంతో అంది.

''మిస్ సంధ్యా! నీ ఆవేశం, నీ ఆవేదన నాకర్థమయ్యాయమ్మా. నీకేంకావాలో చెప్పు'' అని సాంబశివరావుగారు శాంతంగా అడిగారు.

''తప్పుచేసే ఆ వ్యక్తిని శిక్షించండి. ఆ మోసగాడ్ని శిక్షించండి. నాతోనే ఆ వ్యక్తి జీవించి తీరాలని శాసిస్తే అతనికి అది శిక్షకాదు. వరం. అతను అలా ఆడపిల్లల్ని మోసం చేస్తూనే వుంటాడు. మీరిలా పెళ్లిళ్లు చేస్తూనే వుంటారు. ఇటువంటి మోసం, దగా భవిష్యత్తులో ఎవ్వరూ చేయకుండా వుండాలంటే ఈ సాగర్‌కి వేయాల్సిన శిక్ష ఒకటే వుంది. అది... 'సోషల్ బాయ్‌కాట్'

''ఈ సాగర్ ఏ అమ్మాయినీ ప్రేమించడానికి గాని, పెళ్లిచేసుకోవడానికిగానీ వీలులేదని సాంఘిక బహిష్కరణ చేయాలి.

సంధ్య పిడికిళ్లు బిగించిన చేతులు పైకి ఎత్తి బిగ్గరగా అంది. మరుక్షణం అక్కడున్న వారంతా సంధ్యకు వంతపాడారు.

కలెక్టర్ సాంబశివరావుగారు స్త్రీ ఎంత ఎత్తుకి ఎదిగిపోయింది అని తనలో తానే అనుకుని కుర్చీలోంచి లేచారు.

''సంధ్యా జీవితంలో ఎప్పుడూ నిరాశ, నిస్పృహలు దరికి రానీకు. స్త్రీలను బలిచేసుకునే దుష్టసంస్కృతికి వ్యతిరేకివై, సామాజిక స్పృహతో, ఆత్మస్థైర్యంకలిగి ముందుకు మున్ముందుకు సాగిపో! నువ్వు కనాల్సింది మగపిల్లాడ్ని కాదు. ఆడపిల్లని... తెలిసిందా'' చంద్రబింబంలాంటి తన కూతురు మోమును తన చేతుల్లోకి తీసుకుని ఆమె నుదుటిమీద ప్రేమతో, అభిమానంతో ముద్దాడాడు విశ్వనాథం. ◆